క్లుప్తంగా

పారదర్శకంగా ఓటర్ల సర్వే



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ రేణుక

పూతలపట్టు: నియోజకవర్గంలో ఓటర్ల సర్వే పారదర్శకంగా నిర్వహించాలని ఆర్డీఓ రేణుక అన్నారు. మండలంలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గంలోని వివిధ పార్టీ నాయకులకు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఓటర్ల సర్వేను పారదర్శకంగా చేపట్టాలని సూచించారు. ఈ నెల 12వ తేదీ నుంచి 18 వరకు వచ్చిన క్లెయిమ్‌ల వివరాలు రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేసి అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని సూచించారు. అనంతరం నియోజకవర్గంలోని తహసీల్దార్లతో మాట్లాడుతూ ఓటరు సర్వేలో తప్పులు లేకుండా నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. వీలైనంత వరకు బీఎల్వోలు ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ జాన్‌విక్టర్, ఐదు మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు నేత్ర వైద్య పరీక్షలు

యాదమరి: ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులందరూ నేత్ర వైద్య పరీక్షలు చేసుకోవాలని వైద్యాధికారి అనిల్‌కుమార్ నాయక్ కోరారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్క నాటుతున్న కన్వీనర్ బుజ్జిరెడ్డి

ఐరాల: పర్యావరణాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బుజ్జిరెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని పుత్రమద్ది జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం హెచ్‌ఎం లక్ష్మణ బాబు ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి మొక్కలను నాటారు. ఆయన మాట్లాడుతూ స్వచ్ఛమైన పర్యావరణాన్ని భవిష్యత్ తరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ప్రకృతిని ప్రేమించడం, ప్రకృతితో కలిసి జీవించడం ద్వారానే మనిషి మనుగడ సరైన మార్గంలో ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో హేమచంద్రా రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాయంత్రం 6 గంటల్లోపే నిమజ్జనం

బంగారుపాళెం: స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో సోమవారం మండలంలో వినాయక స్వామి ఉత్సవ కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. సీఐ నాగరాజరావు మాట్లాడుతూ, వినాయకచవితి సందర్భంగా మండలంలోని 41 గ్రామ పంచాయతీల పరిధిలో వినాయక విగ్రహాలను మండపాలలో కొలువుదీర్చి వేడుకలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఆయా గ్రామాల్లోని ఉత్సవ కమిటీ సభ్యులు నిమజ్జనాలు మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభించి 6 గంటల్లోపు పూర్తి చేసుకునేలా చూడాలని సూచించారు.

నిరుపేదలకు వరం ఫ్యామిలీ డాక్టర్



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పూర్ణలత

ఐరాల: గ్రామీణుల ఆరోగ్యం కోసం ప్రభుత్వం తీసుకువచ్చిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిరుపేదలకు వరమని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత అన్నారు. మండలంలోని నాంపల్లెలో మంగళవారం ఆమె ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వైద్య శిబిరంలో డాక్టర్ 70 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మంచానికే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

25న కలెక్టరేట్ ఎదుట ధర్నా

చిత్తూరు కార్పొరేషన్: కరెంటు చార్జీలు తగ్గించాలని, వ్యవసాయ సర్వీసులకు స్మార్ట్ మీటర్లు అమర్చరాదని సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 25న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు నాయకులు తెలిపారు. సీపీఎం కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో నాయకులు నాగరాజన్, చైతన్య మాట్లాడుతూ, ధర్నాను విజయవంతం చేయాలని కోరారు.

ధ్వజస్తంభానికి విదేశీ పుష్పాలంకరణ, సుగంధ పుష్పాల స్వాగత ద్వారం, వ్రతకల్ప మండపంలో కొలువు తీరిన గణనాథుడు









ప్రత్యేక ఆకర్షణగా పుష్పాలు, కూరగాయలతో తీర్చిదిద్దిన గణపయ్యలు



భక్తి గీతాలు ఆలపిస్తున్న గాయకురాలు

ఆరంభం.. వరసిద్ధుని బ్రహ్మోత్సవం

కాణిపాకం(యాదమరి): జిల్లాలో ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రం కాణిపాకంలో వరసిద్ధుని బ్రహ్మోత్సవాలు ఆరంభమయ్యాయి. మంగళవారం ఉదయం శాస్త్రోక్తంగా ధ్వజారోహణం నిర్వహించారు. రాత్రి స్వామివారు హంస వాహనంపై ఊరేగారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామివారి దర్శించుకున్నారు. ఆలయంలో పుష్పాలంకరణలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

వ్రతకల్పం

వినాయక చవితి సందర్భంగా సోమవారం గణనాథుని వ్రతకల్పంను అర్చక, వేదపండితులు శేఖర్ గురుకుల్, సుబ్బారావు తదితరులు భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. ఈ వ్రతకల్పంలో అటవీ, విద్యుత్, భూగర్భగనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ రెడ్డెప్ప, పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ పాల్గొన్నారు.

హోమ గుండాలు ప్రారంభం

బ్రహ్మోత్సవాలలో గణేష దీక్ష చేపట్టి ఇరుముళ్లు చెల్లించే భక్తులకు హోమగుండాలను ప్రారంభించారు. భక్తుల రద్దీ దృష్ట్యా ప్యాకెట్ల రూపంలో, ఆలయం వెలుపల భక్తులకు ఉచిత ప్రసాదం పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు.

గొడుగులు, కూరగాయల వితరణ

కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి బ్రహ్మోత్సవాలకు నూతన గొడుగులు, అన్నదానానికి కూరగాయలు దాతలు విరాళంగా అందించారు. చిత్తూరుకు చెందిన కుమారస్వామి నాయుడు బ్రహ్మోత్సవాలలో ఊరేగే వాహన సేవలకు గొడుగులు అందించారు. పలమనేరు మండలం వడ్డేపల్లెకు చెందిన వెంకటరామయ్య స్వామివారి నిత్య అన్నదానంకు 3 టన్నుల కూరగాయలను విరాళంగా అందించారు. దాతలకు ఆలయ అధికారులు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి స్వామివారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటాలు అందించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

బ్రహ్మోత్సవాలలో సోమవారం ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు స్వామివారి ఆస్థాన మండపంలో సాంస్కృతిక ప్రదర్శనలను ప్రారంభించారు. అనంతరం కళాకారులు భరతనాట్యం, భక్తి గీతాలు, కూచిపూడి , నాటికలు ప్రదర్శించగా భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం కళాకారులకు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. ఆలయ అధికారులు పాల్గొన్నారు.

వినాయక స్వామి గ్రామోత్సవం

బంగారుపాళెం: మండలంలోని మొగిలివెంకటగిరిలోని వినాయకస్వామి ఆయంలో సోమవారం ఉదయం స్వామి వారి మూల విగ్రహానికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. రాత్రి స్వామివారి ఉత్సవ మూర్తిని విశేషంగా అలంకరించి పలకిపై కొలువుదీర్చి మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ గ్రామోత్సవాన్ని చేపట్టారు.









హోమగుండాలు ప్రారంభిస్తున్న ఆలయ చైర్మన్, అధికారులు, స్వామివారి సేవలకు గొడుగులను అందిస్తున్న దాతలు, కూరగాయలను ఆలయ చైర్మన్, ఈఓకు అందిస్తున్న దాతలు, పుష్పకావళ్లతో ఊరేగింపుగా వస్తున్న భక్తులు

వెనుకబడిన కులాల అభివృద్ధికి కృషి



కోదండ, మురళిని సత్కరిస్తున్న నాయకులు

తవణంపల్లె: వెనుకబడిన కులాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తానని జాతీయ బీసీ సంఘం పూతలపట్టు నియోజకవర్గ అధ్యక్షులు కోదండ తెలిపారు. మండలంలోని పట్నం ద్రౌపదీ సమేత ధర్మరాజుల గుడిలో మంగళవారం నియోజకవర్గ స్థాయి బీసీ సంక్షేమ సంఘ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీసీల హక్కుల సాధన, సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు. బీసీలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సముచిత స్థానం కల్పిస్తున్నారని వెల్లడించారు. బీసీలందరూ ఏకతాటిపై నిలిచి వైఎస్సార్‌సీపీని గెలిపించుకోవాలని చెప్పారు. అనంతరం బీసీ సంఘం నాయకులు కోదండ, మురళిని శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు మురళి, నాయకులు రమేష్, పెరుమాళ్, రాజేష్, హేమచంద్ర, గిరిబాబు, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

పని మీద ధ్యాసే ధ్యానం

తవణంపల్లె: చేస్తున్న పని మీద ధ్యాస పెట్టడమే ధ్యానమని బ్రహ్మర్షి పత్రీజీ కుమార్తె పరిణీతి పత్రీజీ అన్నారు. మండలంలోని సిద్దంపల్లె సమీపంలో మంగళవారం శ్రీ విఘ్నేశ్వర మహా పిరిమిడ్ శక్తి క్షేత్రంలో ధ్యాన బ్రహ్మోత్సవాలు ప్రారంభించారు. ఈ ఉత్సవాలు 11 రోజుల పాటు నిర్వహించేలా ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ సందర్భంగా పరిణీతి పత్రీజీ మాట్లాడుతూ గౌతమ బుద్ధుడు చెప్పిన శ్వాస మీద ధ్యాసను వివరించారు. కార్యక్రమంలో బ్రహ్మణ రత్న మారం శివప్రసాద్, గ్లోబల్ స్పిరిచువల్ ట్రస్టు వ్యవస్థాపకులు డాక్టర్ గోపాలకృష్ణమూర్తి, కన్వీనర్ రాధిక, ధ్యానులు పాల్గొన్నారు.

భార్యపై చేయి చేసుకున్న భర్తపై కేసు

చిత్తూరు అర్బన్: భార్యపై చేయిచేసుకున్న భర్త, అతని తండ్రిపై చిత్తూరు వన్‌టౌన్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ ప్రసాద్ కథనం మేరకు.. నగరంలోని కొంగారెడ్డి పల్లెకు చెందిన పవన్, రోజాకు ఏడేళ్ల కిందట వివాహమైంది. ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు. ఓ కుమారుడు ఉన్నాడు. రెండేళ్ల క్రితం వేధింపులకు గురిచేయడంతో చిత్తూరు దిశ పోలీస్ స్టేషన్‌లో రోజా ఫిర్యాదు చేసింది. అప్పటి నుంచి వేర్వేరుగా ఉంటున్నారు. కొన్నాళ్ల తరువాత పవన్ భార్యను కాపురానికి తీసుకెళ్లాడు. తనపై ఉన్న పాత కేసును రాజీ చేసుకోవాలని ఒత్తిడి తీసుకొచ్చాడు. ఇందుకు రోజా అంగీకరించకపోవడంతో పవన్‌తో పాటు అతని తండ్రి జ్ఞానప్రకాష్ కూడా ఆమెపై చేయిచేసుకున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పవన్, అతని తండ్రిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా జ్ఞానప్రకాష్ జిల్లా పోలీసు శాఖలో ఏఎస్‌ఐగా విధులు నిర్వర్తిస్తుండడం గమనార్హం.

వినాయక నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు



నిమజ్జన కేంద్రం వద్ద పూజలు చేస్తున్న చిత్తూరు కార్పొరేషన్ కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: నగరంలో వినాయక నిమజ్జనానికి సంబంధించి మునిసిపల్ కార్పొరేషన్ యంత్రాంగం ఏర్పాట్లన్నీ సిద్ధం చేసిందని కమిషనర్ అరుణ చెప్పారు. కట్టమంచి చెరువు వద్ద చేపట్టిన నిమజ్జన ఏర్పాట్లను కమిషనర్ తన అధికారులతో కలిసి పర్యవేక్షించారు. మూడు రోజులపాటు వినాయక నిమజ్జనం సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేపట్టాల్సిన పనులపై అధికారులు, సిబ్బందికి మార్గనిర్దేశం చేశారు. ఏర్పాట్లపై గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతోనూ చర్చించారు. ఆమె మాట్లాడుతూ వినాయక విగ్రహాలు నిమజ్జనానికి వీలుగా కట్టమంచి చెరువులో నీటి మట్టాన్ని పెంచినట్లు, సులభంగా నిమజ్జనం చేయడానికి వీలుగా అదనపు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. మెరుగైన లైటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేశామని, పారిశుధ్య నిర్వహణ కోసం మూడు షిఫ్టలలో అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. ప్రత్యేకంగా హెల్ప్ డెస్క్, మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. చెరువు వద్ద ఇద్దరు గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచామన్నారు. వీటితోపాటు స్వయం సహాయక సంఘాల వారిచే చిరుధాన్యాలు, డ్వాక్రా ఉత్పత్తులతో ప్రత్యేక స్టాల్స్‌ను ఏర్పాటు చేసినట్లు వివరించారు. భారీ వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం క్రేన్లను అందుబాటులో ఉంచామన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయకులను నిమజ్జనం చేయడం, టపాకాయలను తక్కువ స్థాయిలో వినియోగించడం ద్వారా నీటి, గాలి కాలుష్యాలను తగ్గించడానికి సహకరించాలని పిలుపునిచ్చారు. నిమజ్జన సమయంలో చిన్నారులను జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, ఎంహెచ్‌వో డాక్టర్ లోకేష్, డీఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఏఈలు, వార్డు కార్యదర్శులు, గణేష్ నిమజ్జన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.









డీఐరోడ్డులోని వినాయకుని దర్శించుకున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, తుమ్మిందలో పాల్గొన్న ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి, వన్నియర్‌బ్లాక్‌లో కొలువుదీరిన వినాయకుడు, విశేష పూజలందుకుంటున్న డీఐరోడ్డు వినాయకుడు

వాడవాడలా గణనాథుని సంబరం

ఊరూరా చవితి సంబరాలు అంబరాన్నంటాయి. వాడవాడలా గణనాథులు కొలువుదీరారు. రెండు రోజుల పాటు విశేష పూజలు అందకున్నారు. చవితి సంబరాల్లో చిన్న, పెద్ద తేడా లేకుండా ఉత్సాహంగా కనిపించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలోని డీఐ రోడ్డులో సోమవారం వినాయకచవితిని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఏడు రకాల వినాయకుని కొలువుదీర్చి ఉదయం 10 గంటలకు తొలిపూజ చేశారు. వేదపండితులు వేదమంత్రాలు పఠిస్తూ విశేష పూజలు చేశారు. తదనంతరం ఏకదంతున్ని దర్శన భ్యాగం కల్పించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని తరించారు. వచ్చిన భక్తులకు నిర్వాహకులు ఉచిత ప్రసాదం అందజేశారు. కొంగారెడ్డిపల్లి, మురకంబట్టు, దొడ్డిపల్లి, గిరింపేట, మిట్టూరు, కాజూరు, సంతపేట, ప్రశాంత్‌నగర్ తదితర ప్రాంతాల్లో కూడా చవితిని అత్యంత వైభవంగా నిర్వహించారు. రెండు రోజుల పాటు విశేష పూజలు కొనసాగాయి.

గణనాథుని సేవల్లో ఎమ్మెల్యే...

చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు డీఐరోడ్డులో కొలువుదీరిన ఏకదంతుడికి తొలిపూజ చేశారు. కర్పూర హారతి ఇచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం నిర్వాహకులు కన్నన్, దీపక్ ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే బజారు వీధిలోని సుందర వినాయకస్వామిని దర్శించుకున్నారు. తదనంతరం ఉత్సవ ఊరేగింపును ప్రారంభించారు. కట్టమంచిలోని ఓ కల్యాణ మండపంలో కాలినడకన వెళ్లే శ్రీవారి భక్తులకు అన్నదాన కార్యక్రమానికి హాజరయ్యారు.

అన్నదానంలో ఆర్టీసీ వైస్ చైర్మన్...

వినాయకచవితిని పురస్కరించుకుని చిత్తూరు నగరం తుమ్మింద గ్రామంలో భారీ వినాయకుని కొలువుదీర్చారు. ఈ పూజ కార్యక్రమానికి ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డప్పువాయిద్యాలతో గ్రామస్తులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. మంగళవారం మధ్యాహ్నం అన్నదానం చేశారు. అనంతరం ఆయనను జెడ్పీటీసీ ఎం.ఎస్ బాబునాయుడు, వైఎస్ ఎంపీపీ రంజని, సర్పంచ్ అమర్‌నాథ్‌రెడ్డి, నాయకులు కుమార్‌లు ఘనంగా సన్మానించారు.డీఐ రోడ్డులోని వినాయకుని దర్శించుకున్నారు. తర్వాత శ్రీవారి భక్తుల అన్నదానంలో పాల్గొన్నారు.

కట్టమంచి చెరువులో నిమజ్జనం...

నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో కట్టమంచి చెరువులో వినాయకుని నిమజ్జనానికి ఏర్పాట్లు చేశారు. చెరువు చుట్టూ భద్రత చర్యలు చేపట్టారు. భక్తులకు ఇబ్బంది లేకుండా చూసుకుంటున్నారు.

గుడిపాల: మండలంలోని అన్ని గ్రామాల్లో వినాయక చవితి సందర్భంగా ఇళ్లలోనే వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు. సాయంత్రం ఆయా గ్రామాల్లో దేవాలయాల వద్ద ఏర్పాటు చేసిన బొజ్జ గణపయ్యకు కుడుములు, ఉండ్రాళ్లతో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

బంగారుపాళెం: మండలంలో వాడవాడలా వినాయక మండపాలను సిద్ధంచేసి, మంగళతోరణాలు, విద్యుత్‌దీపాలతో నయనా నందకరంగా అలంకరించారు. బొజ్జగణపయ్యలను మండపాలలో కొలువు దీర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బిల్వమాను వీధి, బీసీ కాలనీ, ఓటీకే స్ట్రీట్, మండలంలోని తగ్గువారిపల్లెలో భారీ వినాయక విగ్రహాలను కొలువుదీర్చి పూజలు చేపట్టారు.

శ్రీరాముని అవతారంలో..

యాదమరి: మండలంలోని చెన్నారెడ్డి పల్లె గ్రామంలో శిల్పులు శ్రీ రాముని అవతారంలో వినాయకుని కొలువదీర్చారు. మండలంలోని గ్రామాల్లో భజన మందిరం, రచ్చబండలపై చలువపందిళ్లు వేసి గణపయ్యను కొలువు తీర్చి, పూజలు చేవారు.

ఐరాల: మండల వ్యాప్తంగా సోమవారం ఘనంగా వినాయక చవితి వేడుకలను నిర్వహించారు. వి.యస్.అగ్రహారంలో ఉత్సవ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు. చిన్నవెంకటంపల్లెలో పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు పాల్గొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ బుజ్జిరెడ్డి, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు దేవేంద్రరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.









చిత్తూరు రైల్వేకాలనీ కాంపౌండ్‌లో, గుడిపాల: బొమ్మసముద్రంలో, ఐరాల: గణనాథుడు, యాదమరి: చెన్నారెడ్డిపల్లెలో రామావతారంలో వినాయక స్వామి











యాదమరి: పెరుమాళ్లపల్లెలో బొజ్జ గణపయ్య, చిత్తూరు: డీఐరోడ్డులోని గణపతిని దర్శించుకునేందుకు క్యూలో వేచియున్న భక్తులు, కొంగారెడ్డిపల్లిలో, రెడ్డి కాలనీలో.. బంగారుపాళెం: గ్రామోత్సవంలో వినాయకుడు